సాధారణ గ్రాడ్యుయేషన్‌లో ఉన్నా... మైనర్ సబ్జెక్టులుగా మార్కెట్ డిమాండ్ ఉన్న కోర్సులు చేయటం మంచిది. ఇలాంటి విద్యార్థులు తమ డొమైన్‌లో పటిష్ఠంగా ఉండటంతో పాటు సాఫ్ట్ స్కిల్స్‌ను కూడా అలవర్చుకుంటే వారి ఉద్యోగ సాధన సులభతరమవుతుంది!

సాధారణ డిగ్రీతోనూ ఉద్యోగం సాధ్యమే!

నది ఎంత గొప్పదైనా పరవళ్లు తొక్కుతూ ప్రవహించి కడలిలో కలవాల్సిందే. సముద్రంలో కలిసేందుకు నది తన గమనాన్ని ఎప్పటికప్పుడు మార్చుకుంటుంది. దట్టమైన అడవులను దాటుకుంటూ, కఠినమైన పర్వతాలను కోసుకుంటూ పరుగెడుతుంది. నిర్మలమైన మైదానాల్లో నెమ్మదిగా సాగుతుంది. గమన మార్గం ఏదైనా గమ్యం మాత్రం సాగర సంగమమే.

సరిగ్గా, ఇలాగే.. చదివేది ఏ కోర్సు అయినా చివరికి చేరాల్సింది నచ్చిన ఉద్యోగంలోనే. ఇంజినీరింగ్, సైన్స్, కామర్స్, మేనేజ్‌మెంట్... ఇలా స్ట్రీమ్ ఏదైనా చేరాల్సింది మంచి కొలువులోనే. అయితే ఉద్యోగ సాధనకు వట్టి డిగ్రీ పట్టానే పట్టుకు వేలాడే రోజులు పోయాయి. ఆ డిగ్రీలో మూడేళ్ల పాటో, నాలుగేళ్లపాటో నేర్చుకున్న నైపుణ్యాలు మాత్రమే కాదు కావాల్సింది. అలవర్చుకున్న వ్యక్తిత్వ లక్షణాలే ఉద్యోగ తీరానికి చేర్చే నావలు!

మార్కెట్‌ని బట్టి మారుతున్న కోర్సులు

పాఠ్యాంశాల (కరిక్యులం) విషయంలో విశ్వవిద్యాలయాలకు నియంత్రణ సంస్థలు స్వేచ్ఛను ఇవ్వడంతో మార్కెట్‌కు ఏం కావాలో, ఎలాంటి కోర్సులు అవసరమో గుర్తించి యూనివర్సిటీలు వాటికే రూపకల్పన చేస్తున్నాయి. కార్పొరేట్ కంపెనీలు తరచూ తమ ప్రాంగణాలకు వచ్చి నచ్చిన విద్యార్థులను ఎంపిక చేసుకుంటుండటాన్ని పరిశీలించిన విశ్వవిద్యాలయాలు కంపెనీలకు కావలసిన నైపుణ్యాలనే కోర్సుల కింద ఆఫర్ చేస్తున్నాయి. కంపెనీ ప్రతినిధులతో క్యాంపస్ అధిపతులు తరచూ కలుస్తుండటం వల్ల ఈ మార్పు సాధ్యమైంది. గతంలో పరిస్థితికి ఇది భిన్నం. కొన్ని దశాబ్దాల కిందటివరకూ కంపెనీలు కళాశాల/ విశ్వవిద్యాలయ ప్రాంగణాలను సందర్శించే ఆనవాయితీ ఉండేది కాదు. పట్టా పుచ్చుకున్న విద్యార్థే ఉద్యోగాన్ని అన్వేషిస్తూ కంపెనీల చుట్టూ తిరిగేవాడు. అప్పుడు కంపెనీల అవసరాలు విద్యాలయాల్లో పాఠ్యాంశ నిర్ణేతలకు తెలిసే అవకాశం ఉండేది కాదు. సంప్రదాయ విధానంలో విద్యాలయాలు చదువులు చెప్పేవి. కంపెనీలు తమకు కావలసిన నైపుణ్యాలున్న యువతీ యువకుల కోసం జల్లెడ పడుతుండేవి.

ఏం కావాలో అవే

మారిన సన్నివేశంలో... విద్యార్థికి భవిష్యత్తులో అతడు ఆశించే ఉద్యోగానికి ఏం కావాలో, ఎటువంటి నైపుణ్యాలు అవసరమో సరిగ్గా వాటినే పాఠ్యాంశాలుగా మేళవించి కోర్సులుగా అందిస్తున్నారు. విద్యార్థికి ఇదొక సదవకాశం. ఈ సందర్భంలో నూతన విద్యావిధానాన్ని అనుసరించి డిగ్రీలో ప్రవేశపెడుతున్న మేజర్ సబ్జెక్టు, మైనర్ సబ్జెక్టులు విద్యార్థికి కలిసొచ్చే విషయం.

బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ మేజర్ సబ్జెక్టుగా చదవాలనుకుంటున్న అభ్యర్థి.. మార్కెట్‌లో ఎక్కువ డిమాండ్ ఉన్న క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో ఏదైనా ఒకదాన్ని మైనర్ సబ్జెక్టుగా ఎంచుకోవచ్చు. అలాగే బి.కాం. చేయాలనుకుంటున్న విద్యార్థి కామర్స్ సబ్జెక్టును మేజర్‌గానూ, మైనర్ సబ్జెక్టుగా బిజినెస్ మేనేజ్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్, లాజిస్టిక్స్ అండ్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్, రిటైల్/ ఇన్సూరెన్స్ మేనేజ్‌మెంట్‌లను తీసుకోవచ్చు. దీనివల్ల రెండు విధాల ప్రయోజనం ఉంటోంది. అభ్యర్థి తాను ప్రధానంగా చదవాలనుకుంటున్న కోర్సును వదిలిపెట్టకుండానే తక్షణ నైపుణ్యాలిచ్చి కంపెనీల దృష్టిలో పడేందుకు అవకాశమున్న టెక్నాలజీలను మైనర్ సబ్జెక్టులుగా అధ్యయనం చేసే వీలుండటం. ఇలా డిగ్రీని ప్రతి ప్రధాన సబ్జెక్టుతో మార్కెట్‌లో డిమాండ్ గల టెక్నాలజీ లేదా సబ్జెక్టులను మైనర్ సబ్జెక్టులుగా నేర్చుకోవడం వల్ల కంపెనీలకు కావలసిన నైపుణ్యాలతో సిద్ధంగా ఉన్నట్టే.

కామర్స్, సైన్స్ గ్రాడ్యుయేట్లకూ క్యాంపస్ ప్లేస్‌మెంట్లు

ప్రాంగణ నియామకాల్లో కేవలం ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లనే కాదు, నాన్-ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లనూ ఐ.టి., కార్పొరేట్ కంపెనీలు ఇటీవలికాలంలో భారీగా రిక్రూట్ చేసుకుంటున్నాయి. సైన్స్, కామర్స్ గ్రాడ్యుయేట్ల పట్ల కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. ఎంబీఏలనే కాదు, బీబీఏ చదివిన గ్రాడ్యుయేట్లనూ కంపెనీలు సెలెక్ట్ చేసుకుంటున్నాయి. అయితే ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లలో పరిశీలించిన నైపుణ్యాలనే బీబీఏ విద్యార్థుల్లోనూ పరీక్షిస్తున్నారు.

డొమైన్ నాలెడ్జ్

బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో గ్రాడ్యుయేషన్ చేసిన ఉద్యోగార్థి ఆ సబ్జెక్టులో ఎంత బలంగా ఉన్నాడో కంపెనీలు పరిశీలిస్తున్నాయి. అయితే పూర్తిగా పాఠ్యాంశాలకే పరిమితమైన బుక్కిష్ నాలెడ్జ్ ఉద్దండులకు కంపెనీలు ప్రాధాన్యం ఇవ్వడం లేదు.

కేస్ స్టడీస్‌పై పోటీలు

బి.బి.ఎ., ఎం.బి.ఎ. వంటి కోర్సులు చేసి కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగం సాధించాలనుకుంటున్నవారు వివిధ రౌండ్ల ఎంపిక ప్రక్రియల్లో ఏదో ఒక దశలో కేస్ స్టడీస్‌ను ఎదుర్కోవలసి ఉంటుంది. అందుకే ముందుగా వీటిపై అవగాహన పెంచుకొని సాధన చేయడం వల్ల ప్రయోజనం ఉంటుంది.

టి.సి.ఎస్., ఫ్లిప్‌కార్ట్ కంపెనీలు బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, మేనేజ్‌మెంట్ విద్యార్థులకోసం కేస్ స్టడీస్‌పై కాంపిటిషన్లు నిర్వహిస్తుంటాయి. ఈ పోటీల్లో ఐ.ఐ.ఎం.ల నుంచి సాధారణ కాలేజీల వరకు విభిన్న నేపథ్యాలున్న విద్యార్థులు పాల్గొంటారు. ఇటువంటి పోటీల్లో పాల్గొంటే ఉద్యోగార్థికి రెండు సౌలభ్యాలున్నాయి. మొదటిది- పోటీకి తమ డొమైన్‌లో ఎటువంటి కేస్ స్టడీస్ ముఖ్యమో తెలుస్తుంది. వేటిపై అవగాహన పెంచుకోవాలో అర్థం అవుతుంది. రెండోది- ఈ పోటీల్లో ముందు వరుసలో నిలిస్తే నేరుగా కంపెనీల నుంచే జాబ్ ఆఫర్లు వస్తాయి. ఫలితంగా ప్రైజ్ మనీ, ఉద్యోగం రెండూ సాధించవచ్చు.

> “బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ మేజర్ సబ్జెక్టుగా చదవాలనుకుంటున్న అభ్యర్థి.. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న క్లౌడ్ కంప్యూటింగ్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, స్టాటిస్టిక్స్ సబ్జెక్టుల్లో ఏదైనా ఒకదాన్ని మైనర్ సబ్జెక్టుగా ఎంచుకోవచ్చు. బీకాం. విద్యార్థి కామర్స్ సబ్జెక్టును మేజర్‌గానూ, మైనర్ సబ్జెక్టుగా బిజినెస్ మేనేజ్‌మెంట్, డిజిటల్ మార్కెటింగ్, లాజిస్టిక్స్ అండ్ సప్లై చెయిన్ మేనేజ్‌మెంట్, రిటైల్/ ఇన్సూరెన్స్ మేనేజ్‌మెంట్‌లను తీసుకోవచ్చు. ఇలా చేయడం వల్ల కంపెనీలకు కావలసిన నైపుణ్యాలతో సిద్ధంగా ఉన్నట్టే!”

కంపెనీలకు కావలసింది ఫంక్షనల్ నాలెడ్జ్. అంటే పుస్తక పరిజ్ఞానాన్ని అభ్యర్థి బాహ్య ప్రపంచంతో అనుసంధానం చేసుకుంటున్నాడా? లేదా? అని పరిశీలిస్తున్నారు.

ఉదాహరణకు మార్కెటింగ్ ప్రత్యేక సబ్జెక్టుగా చదివిన అభ్యర్థికి మార్కెట్‌పై కనీస అవగాహన ఉండాలి. మార్కెట్‌లో ఏం జరుగుతోందో ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలని కంపెనీలు భావిస్తాయి. ఫెయిర్‌నెస్ క్రీమ్స్‌లో మెజారిటీ మార్కెట్ వాటా కలిగిన గ్లో అండ్ లవ్లీ బ్రాండ్ గత పేరు ఏమిటి? ఎంతో ప్రాచుర్యం పొందిన ఆ పేరును ఎందుకు మార్చుకోవాల్సి వచ్చింది? దీని వెనుక ఉత్పన్నమైన వివాదం ఏమిటి? అన్న విషయాలపై అవగాహన ఉండాలని రిక్రూటర్లు భావిస్తారు. దీనిపై ప్రశ్న అడిగినప్పుడు నాటి ఫెయిర్ అండ్ లవ్లీ నేటి గ్లో అండ్ లవ్లీగా మారడం వెనుకున్న పరిణామాలు చెప్పగలిగితే కంపెనీ ప్రతినిధులు ప్రసన్నులవుతారు.

ఆయుర్వేద బెషధాల్లో మంచి పేరున్న డాబర్ పుట్టుపూర్వోత్తరాల గురించి ప్రశ్నించినప్పుడు పశ్చిమ్ బెంగాల్‌లో పేదలకు ఆయుర్వేద బెషధాలు ఇవ్వడం నుంచి మొదలైన డాబర్ వేలకోట్ల అమ్మకాలకు చేరిందని ఉద్యోగార్థి చెప్పగలిగితే కంపెనీ ప్రతినిధులు సంతృప్తి చెందుతారు.

హెచ్.ఆర్. స్పెషలైజేషన్‌తో ఇంటర్వ్యూకి హాజరైన ఉద్యోగార్థి నుంచి ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ రంగాల్లో ఉద్యోగుల సంక్షేమ విధానాలను రిక్రూటర్లు తెలుసుకోవాలనుకుంటారు. వీటిపై కనీస అవగాహన ఉంటేనే యాజమాన్యానికీ, ఉద్యోగులకూ మధ్య వారధిగా నిలువగలుగుతారు. అలాగే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగుల సామర్థ్యం, పనితీరు, పెట్టిన పెట్టుబడికి తగ్గట్టుగా ఉద్యోగి సృష్టిస్తున్న సగటు ఆదాయం లెక్కించడం వంటి మౌలిక విషయాలపై తగిన పరిజ్ఞానం ఉన్నదా అని పరిశీలిస్తారు.

– యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

సాఫ్ట్ స్కిల్స్ కూడా..

ఇంజినీరింగ్, మేనేజ్‌మెంట్, సైన్స్ సబ్జెక్టులు వేరు వేరు పంథాలో ఉండవచ్చు. నేర్చుకునే విధానం వేరుగా ఉండవచ్చు. పరీక్షించే పద్ధతి భిన్నంగా ఉండవచ్చు. కానీ, ఏ తరహా విద్యానేపథ్యం గల ఉద్యోగార్థి అయినా మంచి ఉద్యోగిగా సేవలందివ్వాలని కంపెనీలు కోరుకుంటాయి. అందువల్ల ఎంపిక సమయంలోనే వారి డొమైన్ నాలెడ్జ్‌తో పాటు సాధారణ ఉద్యోగ నైపుణ్యాలు ఉన్నాయో, లేవో పరిశీలిస్తారు.

భావ వ్యక్తీకరణ: మేనేజ్‌మెంట్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ఆధారిత పోస్టులు ఆశించేవారు భావ వ్యక్తీకరణలో బలంగా ఉండాలి. 5 పాయింట్లకు ఇంటర్వ్యూ నిర్వహిస్తే 5 పాయింట్లూ సాధించగలగాలి. అదే ఇంజినీరింగ్ విద్యార్థి అయితే 5 పాయింట్లకు 3.5 లేదా 3 పాయింట్లు వచ్చినా కంపెనీలు సర్దుకుపోతాయి. ఉద్యోగ పత్రం ఇచ్చేస్తాయి. కానీ మేనేజ్‌మెంట్, బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ అభ్యర్థులు మాత్రం భావ వ్యక్తీకరణలో నూటికి నూరు మార్కులు తెచ్చుకోవలసిందే.

నేర్చుకోవాలన్న జిజ్ఞాస: కొత్త విషయాలను నేర్చుకోవాలన్న తపన ఉన్న అభ్యర్థులకు కంపెనీలు ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఈ లక్షణం ఉంటే సంస్థలు తమకు కావలసిన టెక్నాలజీ అయినా, మరే విషయమైనా నేర్పించగలుగుతాయి.

త్వరగా కలసిపోయే తత్వం: కొత్తగా కంపెనీలోకి ప్రవేశించిన ఉద్యోగి తక్కువ సమయంలో మిగతావారితో కలిసి పోయి, కొత్త వాతావరణం, కంపెనీ పద్ధతుల్లోకి ఇమిడిపోయేలా ఉండాలని యాజమాన్యం కోరుకుంటుంది. ఈ నైపుణ్యాన్నీ ఎంపిక సమయంలో పరోక్షంగా పరిశీలిస్తారు.

భిన్నమైన దృష్టికోణం: విభిన్నంగా, కొత్తగా ఆలోచించగలిగే ఉద్యోగులే కంపెనీలకు సంపద. అందరిలో ఒకరిగా, గుంపులో గోవింద తీరులో ఉన్నవారిని కంపెనీలు ప్రోత్సహించవు. ప్రతి విషయాన్ని కొత్తకోణంలో చూసి, ఆలోచించగలిగే నైపుణ్యం అలవర్చుకుంటే అది అభ్యర్థికి ఆలంబనే అవుతుంది.

నోటీస్ బోర్డు

ప్రభుత్వ ఉద్యోగాలు

పుణెలోని ఐఐటీఎమ్‌లో రిసెర్చ్ అసోసియేట్‌లు

పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటీరియోలజీ- 30 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

★ రిసెర్చ్ అసోసియేట్: 10 ★ రిసెర్చ్ ఫెలో: 20

అర్హత: డాక్టరేట్ డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేట్ డిగ్రీ ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీలో చదివి ఉండాలి. లేదా మాస్టర్ డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి. దానితో పాటు సీఎస్ఐఆర్-యూజీసీ నెట్, యూజీసీ నెట్, ఐకార్ నెట్, గేట్, జెస్ట్ మార్కులకు ప్రాధాన్యం ఉంటుంది.

సబ్జెక్టులు: మెటీరియోలజీ, అట్మాస్ఫిరిక్ సైన్సెస్, ఓషనిక్ సైన్సెస్, ఫిజిక్స్, అప్లైడ్ ఫిజిక్స్, మ్యాథమెటిక్స్, కెమిస్ట్రీ, ఫిజికల్ సైన్సెస్, మ్యాథమెటికల్ సైన్సెస్ **వయసు:** 15-04-2024 నాటికి రిసెర్చ్ అసోసియేట్‌కు 35 సంవత్సరాలు, రిసెర్చ్ ఫెలోకు 28 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, ఓబీసీలకు 3 సంవత్సరాలు మినహాయింపు ఉంటుంది.

వేతనం: నెలకు రిసెర్చ్ అసోసియేట్‌కు రూ.58,000, రిసెర్చ్ ఫెలోకు రూ. 37,000 **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా....

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 15-04-2024

వెబ్‌సైట్: https://www.tropmet.res.in/Careers

గోవా షిప్‌యార్డ్‌లో టెక్నికల్ అసిస్టెంట్‌లు

గోవాలోని షిప్‌యార్డ్ లిమిటెడ్ - శాశ్వత ప్రాతిపదికన 106 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

★ అసిస్టెంట్ సూపరిన్‌టెండెంట్ (హెచ్ఆర్): 02
★ అసిస్టెంట్ సూపరిన్‌టెండెంట్ (హిందీ ట్రాన్స్‌లేటర్): 1
★ అసిస్టెంట్ సూపరిన్‌టెండెంట్ (సీఎస్): 1 ★ టెక్నికల్ అసిస్టెంట్ (ఎలక్ట్రికల్): 04 ★ టెక్నికల్ అసిస్టెంట్ (ఇన్‌స్ట్రుమెంటేషన్): 1
★ టెక్నికల్ అసిస్టెంట్ (మెకానికల్): 04 ★ టెక్నికల్ అసిస్టెంట్ (షిప్ బిల్డింగ్): 20 ★ టెక్నికల్ అసిస్టెంట్ (సివిల్): 1 ★ టెక్నికల్ అసిస్టెంట్ (ఐటీ): 1 ★ ఆఫీస్ అసిస్టెంట్ - క్లరికల్ స్టాఫ్: 32 ★ ఆఫీస్ అసిస్టెంట్ (ఫైనాన్స్/ఐఏ): 06 ★ పెయింటర్: 20 ★ వెహికల్ డ్రైవర్: 05 ★ రికార్డ్ కీపర్: 03 ★ కుక్ (దిల్లీ): 1 ★ కుక్: 02 ★ ప్లంబర్: 1 ★ సేఫ్టీ స్టివార్డ్: 1

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో బీబీఏ, గ్రాడ్యుయేట్, ఇంజినీరింగ్ పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా, డిగ్రీ, బీఏ, బీఎస్‌డబ్ల్యూ.

దరఖాస్తుకు చివరి తేదీ: 27-03-2024

వెబ్‌సైట్: https://goashipyard.in/

ఐఐటీ మద్రాస్‌లో నాన్ టీచింగ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) మద్రాసు... 64 నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులు కోరుతోంది.

★ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్: 1 ★ అసిస్టెంట్ రిజిస్ట్రార్: 2
★ స్పోర్ట్స్ ఆఫీసర్: 1 ★ జూనియర్ సూపరింటెండెంట్: 9
★ అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్: 4 ★ ఫిజికల్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్: 3
★ జూనియర్ అసిస్టెంట్: 30 ★ కుక్: 2 ★ డ్రైవర్: 2
★ సెక్యూరిటీ గార్డ్: 10

అర్హత: ఎస్ఎస్ఎల్‌సీ, 10+2, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీతో పాటు పని అనుభవం.

వయసు: చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌కు 50 ఏళ్లు; అసిస్టెంట్ రిజిస్ట్రార్/ స్పోర్ట్స్ ఆఫీసర్‌కు 45 ఏళ్లు; జూనియర్ సూపరింటెండెంట్/ అసిస్టెంట్ సెక్యూరిటీ ఆఫీసర్/ ఫిజికల్ ట్రైనింగ్ ఇన్‌స్ట్రక్టర్‌కు 32 ఏళ్లు; జూనియర్ అసిస్టెంట్/ కుక్/ డ్రైవర్/ సెక్యూరిటీ గార్డ్‌కు 27 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: రాత పరీక్ష/ స్కిల్ టెస్ట్/ ట్రేడ్ టెస్ట్/ ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు రుసుము: రూ.500. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మహిళా అభ్యర్థులకు మినహాయింపు ఉంది.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 12-03-2024.

వెబ్‌సైట్: https://recruit.iitm.ac.in/

సర్కారీ కొలువుకు దారేది?

రెండేళ్ల కిందట బీటెక్ పూర్తిచేశాను. ఏడాదిపాటు సాఫ్ట్‌వేర్ జాబ్ చేసి ప్రస్తుతం ఖాళీగా ఉన్నా. ప్రభుత్వ ఉద్యోగంలో స్థిరపడాలంటే ఎలా సన్నద్ధం కావాలి? - రమణ

■ మీరు బీటెక్‌లో ఏ బ్రాంచి చదివారో, ఎలాంటి సాఫ్ట్‌వేర్ జాబ్ చేశారో చెప్పలేదు. మీ ఆశయం కేంద్రప్రభుత్వ ఉద్యోగమా? రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగమా? చేరదలిచింది ప్రభుత్వ రంగ సంస్థల్లోనా? బ్యాంకుల్లోనా? అనే విషయంపై స్పష్టత అవసరం. ఒక్కో ఉద్యోగానికి ఒక్కొరకమైన సన్నద్ధత ఉండాలి. కానీ, ప్రాథమికంగా ఏ ప్రభుత్వ ఉద్యోగానికైనా పోటీ చాలా ఎక్కువగా ఉండటం వల్ల కనీసం రెండు సంవత్సరాలు పట్టుదలతో చదవడం తప్పనిసరి. చాలా పోటీ పరీక్షలకు పాఠశాల/ కళాశాలల్లో చదివిన ప్రాథమిక అంశాలపై అవగాహన ఎంతో అవసరం.

యూనివర్సిటీ పరీక్షలకూ, ఉద్యోగ పోటీ పరీక్షలకూ చాలా తేడా ఉంటుంది. బోర్డు/ యూనివర్సిటీ పరీక్షల్లో ప్రశ్నలను నేరుగా ఇస్తే, పోటీ పరీక్షల్లో అనువర్తనం (అప్లికేషన్)పై అడుగుతారు. చాలా నియామక పరీక్షల్లో జనరల్ స్టడీస్, కరెంట్ అఫైర్స్, మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, డేటా ఇంటర్‌ప్రెటేషన్ భాగంగా ఉంటాయి. మరికొన్ని పోటీ పరీక్షల్లో ఇంగ్లిష్, తెలుగు భాషల పరిజ్ఞానాన్ని కూడా పరీక్షిస్తారు. పోటీ పరీక్షల్లో సరైన సమాధానాన్ని తక్కువ సమయంలో గుర్తించే నైపుణ్యం చాలా ముఖ్యం. కొన్ని పోటీ పరీక్షల్లో తప్పు సమాధానానికి రుణాత్మక మార్కులుంటాయి.

ఇటీవలి కాలంలో పోటీ పరీక్షల్లో ప్రశ్నపత్రాల సరళి పూర్తిగా మారిపోయింది. గతంలో ప్రశ్నలు నేరుగా వచ్చేవి. ఇప్పుడు స్టేట్‌మెంట్ల రూపంలో, జతపరిచే పద్ధతిలో, ఒకటి కంటే ఎక్కువ సమాధానాలు ఉండే ప్రశ్నలు ఇస్తున్నారు. వీటితో పాటు సమకాలీన సామాజిక/ చరిత్రాత్మక అంశాలపై ఒక పేరా ఇచ్చి, దానికి సంబంధించిన ప్రశ్నలను ఇవ్వడం సాధారణం అయింది. కొన్ని పోటీ పరీక్షలను రెండు, మూడు దశల్లో నిర్వహించి ప్రతిభావంతులను ఎంపిక చేస్తున్నారు. మరికొన్ని పరీక్షలకు మొదటి దశలో ఆబ్జెక్టివ్ ప్రశ్నలనూ, రెండో దశలో వ్యాసరూప ప్రశ్నలను విశ్లేషణాత్మకంగా, సమస్య పరిష్కార పద్ధతుల్లో అడుగుతున్నారు. మరికొన్ని కొలువులకు రాత పరీక్షతో పాటు ఇంటర్వ్యూ కూడా ఉంటోంది. మీరు రాయబోయే పోటీ పరీక్షల పాత ప్రశ్నపత్రాలను పరిశీలించి మీ సన్నద్ధతను మొదలు పెట్టండి. పోటీ పరీక్షలకు చదివేప్పుడు అర్థం చేసుకొని, సొంతంగా నోట్సు రాసుకుంటూ నేర్చుకుంటే, విషయ పరిజ్ఞానం పెరుగుతుంది. రాయాలనుకొంటున్న పోటీ పరీక్షకు సన్నద్ధం అవుతున్నవారినీ, గతంలో ఇదే ఉద్యోగం సాధించినవారినీ తరచుగా కలుస్తూ, చర్చిస్తూ సన్నద్ధతలో మెలకువలు తెలుసుకోండి. వీలున్నన్ని నమూనా పరీక్షలు రాసి విజయావకాశాలను మెరుగుపర్చుకోండి. సర్కారీ కొలువు సాధించాలన్న బలమైన ఆశయం ఉండి, ప్రణాళికబద్ధంగా చదివితే, లక్ష్యం సుసాధ్యమే.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

భారత్ ఎలక్ట్రానిక్స్‌లో ట్రెయినీ ఇంజినీర్‌లు

భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, బెంగళూరు కాంప్లెక్స్ తాత్కాలిక ప్రాతిపదికన 517 ట్రెయినీ ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అభ్యర్థులను ముందుగా రెండేళ్ల కాలానికి ఉద్యోగంలోకి తీసుకుంటారు. ప్రాజెక్టు అవసరాలు, అభ్యర్థి పనితీరును బట్టి మరో ఏడాది పొడిగిస్తారు.

ట్రెయినీ ఇంజినీర్ పోస్టులకు దరఖాస్తు చేయాలంటే... బీఈ/ బీటెక్ లేదా ఎంఈ/ ఎంటెక్ ఇంజినీరింగ్ (ఎలక్ట్రానిక్స్/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ అండ్ టెలికమ్యూనికేషన్/ టెలికమ్యూనికేషన్/ కమ్యూనికేషన్/ మెకానికల్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/ కంప్యూటర్ సైన్స్/ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్/ ఇన్ఫర్మేషన్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) పాసవ్వాలి. జనరల్, ఓబీసీ (ఎన్‌సీఎల్), ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 55 శాతం మార్కులతో పాసవ్వాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులు ఉత్తీర్ణులైతే సరిపోతుంది.

01.02.2024 నాటికి బీఈ/ బీటెక్ అభ్యర్థులకు 28 ఏళ్లు, ఎంఈ/ ఎంటెక్ అభ్యర్థులకు 30 సంవత్సరాలు మించకూడదు. గరిష్ఠ వయసులో ఓబీసీ (ఎన్‌సీఎల్) అభ్యర్థులకు 3 ఏళ్లు, ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు 5 ఏళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు 10 ఏళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు రుసుము రూ.150+18 శాతం జీఎస్టీ. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు లేదు. మొత్తం 517 పోస్టుల్లో.. అన్‌రిజర్వ్‌డ్‌కు 210, ఓబీసీలకు 139, ఈడబ్ల్యూఎస్‌లకు 52, ఎస్సీలకు 77, ఎస్టీలకు 39 కేటాయించారు.

సెంట్రల్ జోన్‌లో 68, ఈస్ట్-86, వెస్ట్-139, నార్త్-78, నార్త్‌ఈస్ట్-15, సౌత్-131 ఖాళీలు ఉన్నాయి. ఎంపికైనవారికి మొదటి ఏడాది నెలకు రూ.30,000 రెండో ఏడాది 35,000, మూడో ఏడాది రూ.40,000 వేతనం చెల్లిస్తారు. అభ్యర్థులను జోన్లవారీగా నియమిస్తారు.

ఎంపిక ఇలా...

ఆన్‌లైన్ దరఖాస్తుల ఆధారంగా అభ్యర్థుల షార్ట్‌లిస్ట్‌ను తయారుచేసి రాత పరీక్ష నిర్వహిస్తారు. దీంట్లో ప్రతిభ చూపిన అభ్యర్థులను 1:5 నిష్పత్తిలో ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ వేదికలను తర్వాత కాల్ లెటర్ ద్వారా తెలియజేస్తారు.

✪ రాత పరీక్షకు 85 మార్కులు, ఇంటర్వ్యూకు 15 మార్కులు ఉంటాయి. రాత పరీక్ష, ఇంటర్వ్యూ కాల్ లెటర్లను ఈమెయిల్ ద్వారా పంపుతారు. ఎంపికైన అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్‌లో ప్రకటిస్తారు.

గమనించాల్సినవి

ప్రస్తుతం ఉపయోగిస్తోన్న ఈమెయిల్ ఐడీ, మొబైల్ నంబర్లను మాత్రమే దరఖాస్తులో రాయాలి. ఉద్యోగ సమాచారాన్ని వీటికే తెలియజేస్తారు.

✪ ఇప్పటికీ బెల్ యూనిట్లలో ట్రెయినీ ఇంజినీర్‌గా పనిచేస్తున్నవాళ్లు దరఖాస్తుకు అనర్హులు.

✪ ప్రభుత్వ/ ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తోన్న అభ్యర్థులు 'నో అబ్జెక్షన్ సర్టిఫికెట్'ను దరఖాస్తు సమయంలో అప్‌లోడ్ చేయాలి. లేదా ఇంటర్వ్యూ సమయంలో సమర్పించాలి.

✪ అభ్యర్థులకు ఇంగ్లిష్, హిందీ భాషలు చదవడం, మాట్లాడటం, రాయడం తెలియాలి. దేశవ్యాప్తంగా ఉన్న వివిధ జోన్లలో పనిచేయాలి కాబట్టి ప్రాంతీయ భాషలోనూ నైపుణ్యం ఉండాలి.

✪ టీచింగ్/ అకడమిక్/ రీసెర్చ్ వర్క్/ బ్యాకింగ్/ ఫైనాన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్/ ఎన్జీవోలు/ ఇంటర్న్‌షిప్‌లో చేసిన పనిని అనుభవంగా పరిగణించరు.

సిలబస్ సంగతి?

రాత పరీక్షకు సంబంధించిన సిలబస్‌ను అధికారికంగా ఇప్పటివరకూ వెల్లడించలేదు. దీనికి సంబంధించిన తాజా సమాచారం కోసం తరచూ వెబ్‌సైట్‌ను సందర్శిస్తుండాలి.

✪ పాత ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే సిలబస్, పరీక్ష విధానం గురించి ఒక అవగాహన వస్తుంది. సిలబస్‌లోని ముఖ్యాంశాలను పునశ్చరణ చేసుకుంటే ఫలితం ఉంటుంది.

✪ విద్యార్హతలకు సంబంధించిన అంశాల నుంచి కొన్